# కరివేపాకు

హఠాత్తుగా మెలకువ వచ్చింది. కళ్లు నులుముకుని వాచివైపు చూశాను. టైం నాలుగున్నర.

కంగారు పుట్టుకొచ్చింది. గబగబ తలగడ వద్ద పెట్టుకున్న సెల్‌ఫోన్ తీసి చూశాను. హమ్మయ్య! ఇంకా ఫోను రాలేదు. హాయిగా ఊపిరి పీల్చాను.

సూర్యం ఫోనుతోనే నాకు సోమవారాలు తెల్లవారుతాయి.

సెల్‌ఫోన్ అందుకుని మెల్లగా లేచి కిటికీ వద్దకు నడిచాను. కిటికీ రెక్కలు తీసి తెర కొద్దిగా తొలగించి చూశాను.

మానవ చైతన్యాన్ని మింగే చల్లటి గాలి నన్ను తాకింది. ఊరంతా చీకటిగా వుంది. అక్కడక్కడ దూరంగా కనపడిన వెలుతురు చుక్కలు, రాత్రి కప్పుకున్న చీకటి కంబళిలోని చిరుగుల్లా వున్నాయి. తెల్లమబ్బు నిండిన చుక్కలు లేని ఆకాశం జుట్టు నెరిసిన ముసలి తల్లిలా వుంది.

పశ్చిమాన మునిగిన తన బిడ్డ, సూర్యుడు పంపే కిరణ సందేశాల కోసం ఎదురుచూస్తోంది పాపం.

వీధి చివర ఏదో హడావుడి కనపడింది. కొందరు కుర్రవాళ్లు రోడ్డుమీద చలిమంట పెట్టే ప్రయత్నంలో వున్నారు. హఠాత్తుగా గుర్తుకు వచ్చింది, తెల్లవారితే భోగిపండుగ అని.

సూర్యం నా మనసులో కదిలాడు. చిన్నప్పుడు భోగి పండుగకి వాడు చేసిన హడావుడి అంతా ఇంతా కాదు. ఎక్కడెక్కడ నుంచో చెత్త చెదారం చెక్కముక్కలు ఏరి పెరటిలో చేర్చేవాడు. భోగి ముందురోజు రాత్రి నన్ను అస్సలు నిద్రపోనిచ్చేవాడు కాదు. లేచి భోగిమంట పెట్టమని అర్ధరాత్రి నుంచే నిద్రలేపేవాడు. కానీ యిప్పుడు...

విదేశంలో కూర్చుని డాలర్లు లెక్కపెట్టుకుంటున్నాడు. డబ్బుల వేటలో పడ్డాక పండగలూ, బంధుత్వాలూ ఉంటాయా?

కళ్లు వొత్తుకున్నాను. వీధి చివర భోగిమంట అంటుకుంది. మనిషిలోని ధన దాహంలా ఎగిరి పడుతోంది మంట. ఆ మంట లేపిన పొగ ఊరిని పూర్తిగా కబళిస్తోంది.

ఫోను వైపు చూశాను. ఇంకా కాల్ రాలేదు. ఫోను చెయ్యడా? చేస్తాడు. ఫోనులో వాడి నెంబర్ వెలుగుతుంది. నెంబర్‌తో పాటు వాడు, వాడి భార్య, నా మనవడు వున్న ఫోటో కనపడుతుంది. వాడు మాట్లాడుతాడు.

"ఎలా వున్నావమ్మా? బాగున్నావా?"

"ఊ"

"ఆరోగ్యమెలా వుంది? మందులు వేళకి వేసుకుంటున్నావా?"

"ఊ"

"డాక్టర్ ఇంటికి వచ్చి చూస్తున్నారా?"

"ఊ"

ఫోను పెట్టేస్తాడు. అసలు మాట్లాడను నేను. ఫోనులో ఉన్నంత సేపూ వాడి గొంతు వినాలనే తపన నాది. నేనూ మాట్లాడితే టైం ఎక్కువ అయిందని వాడు ఫోను పెట్టేస్తే, మరో వారం దాకా వాడి గొంతు వినపడదు కదా...

మరోసారి కళ్లు వొత్తుకున్నాను. నాలుగేళ్లు దాటాయి, వాడిని చూసి.

మెల్లగా హాలు వైపు నడిచి సోఫాలో కూలబడ్డాను. సెల్ టీపాయ్ మీద పెడుతుండగా చేతికి తగిలింది టీపాయ్ మీదున్న కరివేపాకు కట్ట. చీకటి పడ్డాక వాచ్‌మేన్ తెచ్చి ఇచ్చాడు ఆ కట్ట. మా అపార్టుమెంటులో కరివేపాకు మొక్కలు ఎక్కువ. పండగలప్పుడు ఆకులు కోసి పంచుతాడు వాచ్‌మేన్.

కరివేపాకు, సూర్యానికి అసలు పడేది కాదు.

"ఈ ఆకులెందుకమ్మా కూరలో...?" అంటూ సూర్యం కసిరేవాడు. తిరిగి తనే "సుఖంగా తిననివ్వక మాటిమాటికి అడ్డు తగులుతూ వుంటాయి" అనేవాడు.

మరోసారి సెల్‌ఫోను వైపు చూశాను. 'కాల్' ఇంకా రాలేదు.

లేచి టి.వి. ఆన్ చేశాను. సెల్‌లో ఏదో చిన్న సవ్వడి. ఆత్రుతగా సెల్ తీసి చూశాను. కాల్ కాదు. ఎస్.ఎం.ఎస్.

'గ్రానీ! మమ్మీ, డాడీ, ఓ.కే. ఫోను వద్దు. ఎస్.ఎం.ఎస్. పంపమన్నారు డాడీ. ఆర్‌యూ ఓకే. వి.ఆర్ ఓకే' మనవడి ఎస్.ఎం.ఎస్.

సోఫాలో అలాగే కూలబడ్డాను. కనుకొలకుల్లో రెండు కన్నీటి బిందువులు. టీపాయ్ మీది కరివేపాకు గాలికి కదులుతోంది.

***